సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్‌ నంబర్‌కు వాట్సాప్‌ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

# ముఖ గుర్తింపునకు.. ముప్పతిప్పలు




- బాలింతలు.. గర్భిణుల గుర్తింపులో సరిగ్గా పని చేయని ఫేస్‌ రికగ్నిషన్‌ యాప్‌లు
- ఉక్కిరి బిక్కిరవుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు
- సక్రమంగా సాగని పోషకాహారం పంపిణీ

**అల్లిపురం:** అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌లతో సతమతమవుతున్నారు. లబ్ధిదారులకు పోషణ ట్రాకర్, బాలసంజీవిని అందించాలంటే నాలుగు యాప్‌లు నిర్వహించాలి. లబ్ధిదారుల ఫేస్‌ రికగ్నైజ్‌ చేసి యాప్‌ నమోదు చేయాలి. అయితే ఇక్కడే పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ గుర్తింపు చాలాసార్లు సక్సెస్‌ కావడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. ప్రభుత్వం బాలసంజీవిని ద్వారా లబ్ధిదారులకు ముఖ గుర్తింపుతో బియ్యం ఇస్తున్నారు. అయితే ఇప్పుడు తాజాగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్‌ ద్వారానే లబ్ధిదారులను గుర్తించి సరుకులు ఇవ్వాలనే నిబంధనను తప్పనిసరి చేయడంతో కార్యకర్తలు రెండు యాప్‌లు నిర్వహించాల్సి ఉంటుంది. ఇది కష్టంగా ఉందని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు. ఆ యాప్‌ల గురించి ముందుగా శిక్షణ ఇప్పిస్తే ఫలితం ఉంటుందని అంటున్నారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు 6 నెలల నుంచి 3 సంవత్సరాల బాలలకు ప్రతి నెల పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. గతంలో లబ్ధిదారులకు అంగన్‌వాడీ కేంద్రాల వద్దే పోషకాహారం ఇచ్చేవారు. అయితే ఎక్కువ మంది తమకు ఇంటి వద్దకే పోషకాహారం కావాలంటూ ప్రభుత్వాన్ని అభ్యర్థించడంతో టీహెచ్‌ఆర్‌ (టేక్‌ హోమ్‌ రేషన్‌)గా మార్చి పాలు, కోడి గుడ్లు, నూనె, పప్పు దినుసులు, బియ్యం వంటివి ప్రతి నెలా రెండు దఫాలుగా అందిస్తున్నారు. నెలలో ఎక్కువ సమయం ఈ పనికే వినియోగించడం వల్ల చిన్నారుల ప్రాథమిక విద్యకు ఇబ్బందిగా మారిందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రెండు సార్లు నమోదు కష్టంగా మారింది..**

ఆయా కేంద్రాల్లో ఉన్న గర్భిణులు, బాలింతలు, 6 నెలల నుంచి 3 సంవత్సరాలు కలిగిన చిన్నారుల పూర్తి వివరాలను పోషణ యాప్‌ ద్వారా రెండు సార్లు నమోదు చేయాల్సి వస్తోందని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. అదే విధంగా టీహెచ్‌ఆర్‌ (టేక్‌ హోమ్‌ రేషన్‌) అందించాలంటే ఒకే వ్యక్తిని రెండుసార్లు ముఖ యాప్‌ ద్వారా గుర్తించాల్సి రావడం కూడా ఇబ్బందికరంగా మారిందంటున్నారు.


యాప్‌ గుర్తింపు కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

**ప్రాథమిక విద్యకు ఇబ్బందులు..**

అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో 15 రకాల రికార్డులు నిర్వహించాల్సి వస్తోంది. దీని వల్ల చిన్నారుల ప్రాథమిక విద్యకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోతున్నారు. ఇందులో లబ్ధిదారులకు అందించే ఆహార వినియోగం (ఎఫ్‌సీఆర్‌), పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నమోదు చేసే రికార్డులు (ఎస్‌ఎన్‌టీ), ప్రీ స్కూల్‌ అడ్మిన్‌ రికార్డులను ప్రతి నిత్యం విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. వాటితో పాటుగా పిల్లలకు అందించే టీకాలకు సంబంధించిన రికార్డుల రిజిస్టర్, విటమిన్‌–ఎ రికార్డు, రిఫరల్‌ సర్వీసెస్‌ గృహ సందర్శకుల రికార్డులు నిర్వహించాలి. దీంతో పాటు నెలవారీ ప్రాజెక్టు (ఎంటీఆర్‌), ఆయా అంగన్‌వాడీల పరిధిలోని హౌస్‌ హోల్డ్‌ సర్వే, గ్రోత్‌ రికార్డు, గ్రోత్‌ చార్ట్‌తో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్‌ హోమ్‌ రేషన్‌ పంపిణీ రికార్డు, స్టాఫ్‌ అడ్మిన్‌ రిజిస్టర్‌ నిర్వహించాల్సి వస్తోందంటున్నారు.

**నెట్‌ వర్క్‌ పని చేయని ప్రాంతాల్లో మరీ ఇబ్బంది..**

అంగన్‌వాడీ కేంద్రాల్లో నెట్‌ వర్క్‌ కష్టాలు అధికంగా ఉండడంతో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. మొబైల్స్‌ ర్యామ్‌ తక్కువగా ఉండటంతో తక్షణమే యాప్‌ స్పందించక తిప్పలు తప్పటడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. అలాగే యాప్‌ల వల్ల తాము ఇబ్బంది పడుతున్నామని గర్భిణులు, బాలింతలు సైతం వాపోతున్నారు.

## యాప్‌ పని చేయక రేషన్‌ కోల్పోతున్నాను..



నా ఫేస్‌ రికగ్నిషన్‌కు పోషణ యాప్‌ ద్వారా 15 సార్లు ఐరిస్‌ తీసినా వీలు కాలేదు. ఒకసారి సక్సెస్‌ వచ్చినా రెండో సారి మ్యాచ్‌ కావటం లేదు. దీని వల్ల నేను రేషన్‌ కోల్పోతున్నాను. ప్రభుత్వం స్పందించి యాప్‌ కష్టాలు తొలగించాలి. – సిరిగిరి దుర్గ, అల్లిపురం

## యాప్‌ల భారం తగ్గించాలి..

ప్రభుత్వం స్పందించి యాప్‌ల భారం తగ్గించాలని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. క్షేత్ర స్థాయిలో ఏ కార్యక్రమాలను ప్రభుత్వం తలపెట్టినా మొదటిగా అంగన్‌వాడీ కార్యకర్తలను భాగస్వాములను చేస్తున్నారని వాపోతున్నారు. తల్లి గర్భం దాల్చినప్పటి నుండి బిడ్డ పుట్టి ఆరేళ్లు వచ్చే వరకు అంగన్‌వాడీ కార్యకర్తలే వారిని నిత్యం పర్యవేక్షించాలి. తల్లికి, బిడ్డకు పోషణతో పాటు బిడ్డలకు టీకాలు, వారి ఆరోగ్య కార్డులు తదితర వివరాలను నిత్యం అంగన్‌వాడీ కార్యకర్తలే యాప్‌ల ద్వారా నిర్వహించాలి.


పోషణ్‌ పట్వాడా యాప్‌

## క్లుప్తంగా

### శభాష్‌ పోలీస్‌


బాలుడిని తల్లి చెంతకు చేర్చిన పోలీస్‌

**డాబాగార్డెన్స్‌:** జీవీఎంసీ 39వ వార్డు చిలకపేటకు చెందిన మూడేళ్ల గౌతం తప్పిపోయి రోడ్డుపై ఏడుస్తుండగా, స్థానికులు గుర్తించి వన్‌టౌన్‌ సీఐ జీడీ బాబు, ఎస్‌ఐ లక్ష్మణ్, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పోలీసులు పూర్తి సమాచారం సేకరించి రెండు గంటల్లోనే ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. వారు వన్‌టౌన్‌ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

### రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా?


సత్యనారాయణ

**అల్లిపురం:** మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామో.. నియంత పాలనలో ఉన్నామో అర్థం కావడం లేదని వైఎస్సార్‌సీపీ లీగల్‌ సెల్‌ అధికార ప్రతినిధి, సీనియర్‌ న్యాయవాది పాకా సత్యనారాయణ అనుమానం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మిధున్‌రెడ్డిని అరెస్ట్‌ చేయడం శోచనీయమన్నారు. రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేసిందని ఆరోపించారు. బెల్ట్‌ షాపులు ఎక్కడ పడితే అక్కడ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా పట్టించుకునే వారే లేరన్నారు. విజయవాడ సీబీఐ కోర్టులోకి వెళ్లకుండా న్యాయవాదులను అడ్డుకోవడం శోచనీయమని అన్నారు. కోర్టు న్యాయవాదులకు ఇల్లులాంటిదని, దానిని వారికి దూరం చేద్దామనుకోవడం అవివేకమని అన్నారు.

### సామాజిక భవనం ప్రారంభం


చాకలిపేటలో సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

**సీతంపేట:** జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌ చాకలిపేటలో రూ.20 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్‌ ముక్కా శ్రావణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రజలకు ఎటువంటి సాయం కావాలన్నా నేరుగా తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### నిత్యావసర సరకుల వితరణ


పేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేస్తున్న పోతు సత్యనారాయణ

**సీతంపేట:** స్థానిక నెహ్రూ బజార్‌లో నిమ్మకాయలు, ఆకుకూరలు విక్రయిస్తూ జీవిస్తున్న దూసి అప్పలస్వామి ఇటీవల ఆకస్మికంగా మరణించాడు. దీంతో అతడి కుటుంబం ఆధారం లేక దిక్కులేనిదైంది. స్థానిక వ్యాపారుల ద్వారా విషయం తెలుసుకున్న 26వ వార్డు నాయకుడు పోతు సత్యనారాయణ ఆ కుటుంబానికి ఆదివారం నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేసి గొప్ప మనసు చాటుకున్నారు. కార్యక్రమంలో బజారులోని వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

### యువతను సన్మార్గంలో నడపండి

**కంచరపాలెం:** కంచరపాలెం ఐదో పట్టణ లా అండ్‌ ఆర్డర్‌ సీఐ కె.రవికుమార్‌ను ఆదివారం వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకుడు, జిల్లా ఐఎన్‌టీయూసీ కార్యదర్శి గంటా కామరాజు, జాతీయ క్రీడాకారుడు ఎన్‌.వి.రమణ, పార్టీ 55వ వార్డు యూత్‌ కార్యదర్శి గంటా భార్గవ్‌కుమార్‌ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. కంచరపాలెం పరిధిలో మత్తుకు బానిసవుతున్న యువతను సన్మార్గంలోని నడిపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. 55వ వార్డులో యువత కోసం అవగాహన సదస్సులు నిర్వహించేందుకు పోలీసులకు వైఎస్సార్‌సీపీ నుంచి సహకరిస్తామని భార్గవ్‌కుమార్‌ తెలిపారు.

## స్వచ్ఛ దేవాలయం ప్రాజెక్టు ప్రారంభం

**డాబాగార్డెన్స్‌:** ఆలయాల్లో పరిశుభ్రత, స్వచ్ఛత కల్పించడం అభినందనీయమని వీఎంఆర్‌డీఏ కమిషనర్‌ కేఎస్‌ విశ్వనాథన్‌ పేర్కొన్నారు. రోటరీక్లబ్‌ వైజాగ్‌ కపుల్స్‌ 2వ స్వచ్ఛ దేవాలయం ప్రాజెక్టును ఆదివారం నగరంలోని ఓ దేవాలయంలో ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ స్వచ్ఛ దేవాలయం లక్ష్యంతో రోటరీ సంస్థ దేవాలయాలు, వివిధ ప్రాంతాల్లో పరిశుభ్రతను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రోటరీక్లబ్‌ 3020 జిల్లా గవర్నర్‌ శోభన్‌ ప్రకాష్‌ స్వచ్ఛ దేవాలయం చొరవను ప్రశంసించారు. క్లబ్‌ కపుల్స్‌ అధ్యక్షుడు ధర్మేందర్‌ వరద, కార్యదర్శి శ్రావణి చిట్టూరి, రోటరీ క్లబ్‌ వైజా జంటల సభ్యులు ఆరోగ్యకరమైన వాతావరణం సృష్టించే దిశగా తమ ప్రయత్నాలు సాగిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛ దేవాలయం చొరవ కింద ఇది రెండవ ప్రాజెక్టని చెప్పారు. క్లబ్‌ కమ్యూనిటీ సేవా, వృత్తి శిక్షణ, పర్యావరణం, వివిధ రంగాలపై దృష్టి పెడుతుందన్నారు.

## ముగిసిన హరికథా ఉత్సవం


భక్త రామదాసు కథను గానం చేస్తున్న కళాకారిణి

**మద్దిలపాలెం :** హరికథా పితామహుడు అజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసు జ్ఞాపకార్థం విశాఖ మ్యూజిక్‌ అండ్‌ డ్యాన్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన హరికథా ఉత్సవం ఆదివారంతో ముగిసింది. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ ఉత్సవం భక్త రామదాసు ప్రదర్శనతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 27న రుక్మిణి కళ్యాణాన్ని అర్చక స్వాములు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

## హోమియో వైద్యుల నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గం

**డాబాగార్డెన్స్‌:** హోమియో వైద్యుల నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్లో జరిగింది. సంఘం ఆంధ్ర రాష్ట్ర ప్రధాన సలహాదారుడు డాక్టర్‌ కేవీఆర్‌ఎల్‌ఎన్‌ శర్మ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్‌ పి.రాఘవేంద్రను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్‌ ఎం.శివకాంతి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్‌ రాజా శ్రీకాంత్, కన్వీనర్‌గా డాక్టర్‌ ఎం.చంద్రశేఖర్, ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా డాక్టర్‌ వి.సునీత, కోశాధికారిగా డాక్టర్‌ ఎస్‌.సుధాకర్, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్‌ ఎస్‌.ఆనందరావు, డాక్టర్‌ ఆర్‌.శ్రీదేవి, డాక్టర్‌ ధవళమూర్తి, డాక్టర్‌ వి.మల్లికార్జునరావు, మహిళా విభాగం ప్రతినిధిగా డాక్టర్‌ జగధాత్రిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు డాక్టర్‌ రాఘవేంద్రరావు సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా నిర్వహించిన సదస్సులో అరుదైన హోమియో మందుల వాడకం అనే అంశంపై వక్తలు డాక్టర్‌ ఎం.చంద్రశేఖర్, డాక్టర్‌ రాజేంద్రప్రసాద్, డాక్టర్‌ పి.శివరామకృష్ణ ప్రసంగించారు. డాక్టర రాజాశ్రీకాంత్, డాక్టర్‌ వి.సునీత కార్యక్రమం నిర్వహించారు.

## చెస్‌తో మరింత తార్కిక జ్ఞానం


విజేతలైన చిన్నారులతో నిర్వాహకులు

**డాబాగార్డెన్స్‌:** ప్రపంచ చదరంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఇంటరాక్ట్‌ క్లబ్‌ ఆఫ్‌ వీసీసీ ఆధ్వర్యంలో నగరంలోని సెయింట్‌ ఆంథోనీ ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీసీ కన్వీనర్‌ కె.సుశీల మాట్లాడుతూ ఇంటర్నేషనల్‌ చెస్‌ డే సందర్భంగా ప్రతి సంవత్సరం చెస్‌ పోటీలు వివిధ స్థాయిల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదరంగం ఆట ద్వారా లాజికల్‌ థింకింగ్‌ పెరుగుతుందని, అందుకోసమే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు చెస్‌పై శిక్షణ కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. సబ్‌ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్‌ కేటగిరీల్లో పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. విజేతలకు రోటరీక్లబ్‌ డిస్ట్రిక్ట్‌ యూత్‌ ప్రొటెక్షన్‌ చైర్‌ మొదాంబికా అందజేశారు. రోటరీ సహకారంతో 132 ఇంటరాక్ట్‌ క్లబ్స్‌ ఏర్పాటు జరిగిందని, క్లబ్స్‌ ద్వారా నాయకత్వ అభివృద్ధి, విద్యకు సంబంధించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు మొదాంబిక తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్లుగా గౌతమ్, ప్రీతి, కల్యాణి, మణి, ఎల్లాజి పాల్గొనగా, జడ్జిలుగా లక్ష్మణ్, మాధవరావు, బుజ్జి వ్యవహరించారు. కార్యక్రమంలో భార్గవి ట్యూషన్‌ సెంటర్‌ కో ఆర్డినేటర్‌ సతీష్‌ పాల్గొన్నారు.

## ఎట్టకేలకు కల్వర్టు నిర్మాణం పూర్తి

- రాకపోకలకు సులభతరంగా మారిన వన్‌టౌన్‌ రహదారి


టౌన్‌ కొత్తరోడ్డు వద్ద పూర్తయిన కల్వర్టు

**జగదాంబ:** ఎట్టకేలకు టౌన్‌ కొత్తరోడ్డు వద్ద కల్వర్టు నిర్మాణం పూర్తి చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగదాంబ నుంచి వన్‌టౌన్‌ పోలీసు స్టేషన్‌ వరకు రహదారి విస్తరణతో పాటు ఫుట్‌పాత్‌లు, కల్వర్టు నిర్మాణానికి రూ. 12 కోట్ల నిధులు వెచ్చించిన సంగతి తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఏవీఎన్‌ కళాశాల డౌన్‌ వరకు సాగిన ఈ పనులు పట్టించుకున్న నాథుడు లేక తర్వాత నిలిచిపోయాయి. ఈ విషయమై 'సాక్షి'దినపత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో వన్‌టౌన్‌ విస్తరణ పనులు తిరిగి ప్రారంభించారు. అందులో భాగంగానే టౌన్‌ కొత్తరోడ్డు వద్ద కల్వర్టు పనులు కూడా మొదలుపెట్టారు. అయితే కొంత మేర పనుల తర్వాత మళ్లీ ఆగిపోయిన నేపథ్యంలో మళ్లీ 'సాక్షి'లో ప్రచురించిన కథనాలకు స్పందించి జీవీఎంసీ పనులు ప్రారంభించడంతో కల్వర్టు పనులు పూర్తి అయ్యాయి. దీంతో ఆ ప్రాంత ప్రజలు, బంగారు వర్తకులు, చిరు వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ప్రతినిధులు

**పెందుర్తి:** త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సరిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. సమితి ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కె.త్రినాథరావు, బి.పైడన్న, సన్యాసి, లక్ష్మీభవాని, అచ్చియ్యమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సందడి చేసిన పూర్వ విద్యార్థులు


అంతా ఒక చోటుకు చేరిన పూర్వ విద్యార్థులు

**డాబాగార్డెన్స్‌:** మహాత్మాగాంధీ మున్సిపల్‌ ఉన్నత పాఠశాల (ఎంజీఎం హైస్కూల్‌) పూర్వ విద్యార్థులు ఆదివారం నగరంలోని ఓ పూర్వ విద్యార్థి ఇంటి వద్ద కలుసుకున్నారు. 1977–78 బ్యాచ్‌కి చెందిన వీరంతా అప్పటి రోజులు గుర్తుకు తెచ్చుకుని రోజంతా సంతోషంగా గడిపారు. కష్ట సుఖాలు పంచుకున్నారు. వీరిలో కొందరు రాజకీయ నాయకులుగా.. మరికొందరు ఉద్యోగులుగా వృత్తి విరమణ చేశారు. ఇంకొందరు వ్యాపార రంగంలో కొనసాగుతున్నారు.

## బ్రహ్మకుమారీస్‌ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న బ్రహ్మకుమారీ సంస్థ సభ్యులు

**తాటిచెట్లపాలెం:** బ్రహ్మకుమారీస్‌ రైల్వే న్యూకాలనీ శాఖ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌ సమీపంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో ఆదివారం బ్రహ్మకుమారీలు, రోటరీ బ్లడ్‌ సెంటర్‌ ప్రతినిధులు సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ బ్లడ్‌ సెంటర్‌ ప్రతినిధులు మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురి వ్యక్తుల ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఆరోగ్యవంతులైన 18 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వయసు గల వారెవరైనా ఏడాదికి మూడు సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. శ్రీ తేజావతి మాతాజీ ప్రథమ వర్ధంతి సందర్భంగా బ్రహ్మకుమారీస్‌ సోషల్‌ సర్వీస్‌ వింగ్‌ ప్రేరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధి శశికళ చెప్పారు. కార్యక్రమంలో రోటరీ బ్లడ్‌ సెంటర్‌ చైర్మన్‌ కె.వి.శ్రీనివాసరావు, డాక్టర్‌ ఎ.మురళీధర్, డాక్టర్‌ అశోక్, సిబ్బంది, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

## 'స్మార్ట్‌ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించండి'


ప్రచారం చేస్తున్న సీపీఎం సీనియర్‌ నాయకుడు రాజు

**డాబాగార్డెన్స్‌:** సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జగదాంబ జోన్‌ ఆధ్వర్యంలో పితానిదిబ్బ, గంజిపేట, భానోజీనగర్‌ ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకుడు నర్సింగరావు ఆధ్వర్యంలో స్మార్ట్‌ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్‌ నాయకుడు వై.రాజు మాట్లాడుతూ ఎన్నికలు రాక ముందు ఈ పెద్ద మనుషులే స్మార్ట్‌ మీటర్లు పెడితే పగలగొట్టండని పిలుపునిచ్చారని, ఇప్పుడు వాళ్లే స్మార్ట్‌ మీటర్లు పెట్టి, ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. పార్టీ మరో నాయకుడు గోవిందరావు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, మరో వైపు విద్యా, వైద్యం ఖర్చులు కూడా పెరిగిపోయాయని, ఇంకో వైపు అసంఘటితరంగ కార్మికులకు పనులు దొరకని పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రజలపై ఈ విధంగా భారం మోపడం ప్రభుత్వం మానుకోవాలన్నారు. ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో దానయ్య, గణేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ ప్రతిష్టను దిగజార్చకండి


జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ ఆలయం

**కంచరపాలెం:** కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం ఈవో సురేష్‌బాబుపై తప్పుడు వార్తలు ప్రచురించడం సరికాదని ఆలయ ట్రస్ట్‌ బోర్డు సభ్యులు, జ్ఞానాపురం, అచ్చియ్యమ్మపేట గ్రామ పెద్దలు హెచ్చరించారు. ఈ మేరకు జ్ఞానాపురం ఆలయ ఆవరణలో ఆదివారం ట్రస్టు సభ్యులు, గ్రామ పెద్దలు ప్రకటన విడుదల చేశారు. కొన్ని చిన్న వార్తా పత్రికలు, యూట్యూబ్‌ చానెళ్లు తప్పుడు వార్తలు ప్రచురించి, ఆలయంలో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు చేస్తూ, ఆలయ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేయడం సరి కాదన్నారు. దీనివల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. పాలకవర్గం సమన్వయంతో ఉత్సవాల నిర్వహణలోనూ, దేవాలయ అభివృద్ధిలోనూ, భక్తులకు సౌకర్యాలు కల్పించడంలోనూ, ఆలయ ఖర్చులు తదితర అన్ని విషయాల్లోనూ పారదర్శకంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఆయన ఈవోగా బాధ్యతలు చేపట్టిన నాటికి ఆలయ వార్షిక ఆదాయం రూ.81.46 లక్షలు ఉండేదని, నేడు రూ.2.62 కోట్లకు పెరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేని నేటి కూటమి నాయకుల ప్రమేయంతో దుష్ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆలయ చైర్మన్‌ లండా రమణ, ట్రస్టు బోర్డు సభ్యులు ఆదినారాయణ, వి.నారాయణ, శ్యామ్, తేజా, రత్నం, గౌరీ, దానయ్యమ్మ, అచ్చియ్యమ్మపేట, జ్ఞానాపురం ఆలయ సంక్షేమ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆసక్తికరంగా స్టోరీ టెల్లింగ్‌


కథా రచనపై చిన్నారులకు సూచనలిస్తున్న సీతా శ్రీనివాస్‌

**సీతంపేట:** విశాఖ పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్‌ పబ్లిక్‌ స్కూల్‌ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన ప్రత్యేక నైపుణ్య ఆధారిత సృజనాత్మక పిల్లల కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 70 మంది పిల్లలు పాల్గొన్నారు. స్టోరీ టెల్లర్‌ సీతా శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం వర్క్‌షీట్‌ కార్యాచరణతో ప్రారంభమైంది. పిల్లలు ఆకారాలు గీయడం, బొమ్మలను అనుసంధానం చేయడం, పాత్రలను కనుగొనడం వంటి విశేషమైన నైపుణ్యాలను ప్రదర్శించారు. ప్రతి ఒక్కరికీ ఒక పాత్ర అప్పగించి వాటి ఆధారంగా బృందాలను ఏర్పాటు చేసి, అనంతరం వారు బొమ్మలకు రంగులు వేసి తమ పాత్రల ఆధారంగా కథలు తయారు చేసి వాటిని ప్రేక్షకులకు ప్రదర్శించారు. కేవలం కథ మాత్రమే కాకుండా విజువల్‌ కోడింగ్, సృజనాత్మక ఆలోచన, బృంద సహకారం, కథన నైపుణ్యం, ప్రెజెంటేషన్‌ వంటి నైపుణ్యాలను ప్రోత్సహించే విధంగా కార్యక్రమం సాగింది.

